సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



పట్టపగలే చోరీ

పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు IIలో ▸



కొనసాగుతున్న అధ్యయనం

సిద్దిపేట మున్సిపాలిటీని వివిధ మున్సిపల్ కమిషనర్లు శనివారం సందర్శించారు. వివరాలు IIIలో ▸



సస్యరక్షణతో నత్తల నివారణ

కూరగాయల సాగులో నత్తల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచించారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

హుస్నాబాద్: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. నవంబర్ 13న సాయంత్రం హుస్నాబాద్ బస్టాండ్ నుంచి బయలుదేరి హైదరాబాద్ మీదుగా అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఆంధ్ర కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనం, గోల్డెన్ టెంపుల్ వీక్షించిన అనంతరం 14వ తేదీ రాత్రి అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 15న సాయంత్రం బయలుదేరి 16న ఉదయం అలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తి పీఠం సన్నిధికి వెళ్తుందని పేర్కొన్నారు. అక్కడ దర్శనాంతరం హుస్నాబాద్‌కు అదే రోజు సాయంత్రం చేరుకుంటుందని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ కోటిలింగాల ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయం, మారుతినగర్, శ్రీసాయినగర్, గాంధీనగర్, సుభాష్‌నగర్, సంతోష్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, ముదిరాజ్‌గడ్డ, ఇందిరానగర్, బాలాజీనగర్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

లింగాపూర్‌లో ధాన్యం కేంద్రం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట మండలం లింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ డీపీఎం కరుణాకర్ ఏర్పాటు చేశారు. 'లింగాపూర్ గ్రామస్తుల నిరసన.. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు డిమాండ్' అనే కథనాన్ని శనివారం సాక్షి ప్రచురించింది. దీనికి ఆయన స్పందించారు. గ్రామంలోని మహిళా సంఘాలు, రైతులతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించారు. ప్రభుత్వ స్థలమైన వీరరాఘవుల కుంటలోనే కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏపీఎం బాబురావు, సీసీ మహేందర్, మాజీ సర్పంచ్‌లు బండి చంద్రయ్య, ముక్క కనకయ్య, సిరిమల్ల భాస్కర్, సుందరగిరి భాస్కర్, జెల్ల శ్రీనివాస్, కోడూరి వెంకటేశ్వర్లు, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



సుశాంత్

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గజ్వేల్‌లో ఉన్న సెయింట్ పీటర్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి సుశాంత్ ఎంపికైనట్లు శనివారం గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో వచ్చే నెల సంగారెడ్డిలో నిర్వహించే ఈ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు అండర్-19 తరఫున ఆడుతాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సమ్మయ్య, గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు నరేశ్, కోచ్ నాగేశ్, సభ్యులు శ్రీనివాస్, శేఖర్, మహేశ్‌గౌడ్, సతీశ్, నర్సింహులు, తౌటి శ్రీను, హన్మంతరెడ్డి, కృష్ణమూర్తిలు శుశాంత్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి విద్యార్థిని

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని ఆకునూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని నాజియా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఐలయ్య శనివారం తెలిపారు. ఈనెల 20న మెదక్‌లో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలో జరిగే పోటీలకు హాజరుకానుందన్నారు. విద్యార్థినిని హెచ్ఎం ఐలయ్య, పీఈటీ కవిత అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం


సిద్దిపేటరూరల్: జిల్లాలోని అర్హత, నైపుణ్యం కలిగిన సెమిస్కిల్డ్ కార్మికులకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నీల రాఘవేందర్ శనివారం తెలిపారు. ఈనెల 28న సిద్దిపేటలోని ఐటీ టవర్‌లో విదేశీ ఉద్యోగావకాశాలపై అవగాహన, పలు రకాల ఖాళీల భర్తీకి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ కలిగిన వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

స్మార్ట్ బాయ్స్

సండే స్పెషల్

- కాలంతో పరుగెడుతున్న 'డెలివరీ బాయ్స్'
- ఆర్డర్ పెట్టిన నిమిషాల్లో ఇంటి ముందుకు..
- గిగ్ వర్కర్లను డెలివరీ పార్ట్‌నర్స్‌గా మాత్రమే గుర్తింపు
- ఏ పనీ దొరకని నిరుద్యోగులకు ఉపాధి
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2 వేల మందికి పైగానే డెలివరీ బాయ్స్





పట్టణాలకు పాకిన ఈ–కామర్స్

ఇంటర్నెట్‌తో ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిపోయింది. పుస్తకాల అమ్మకాలతో గెలుపుబాట పట్టిన ఈ కామర్స్ బిజినెస్ ఇప్పుడు అంతటా వ్యాపించింది. బుక్, ఫుడ్, ఫోన్, కాస్మోటిక్స్, మెడిసిన్స్, ఫర్నిచర్, హోం అప్లయన్సెస్ ఒకటేమిటీ సర్వం ఇక్కడ లభిస్తున్నాయి. మనం ఫోన్‌లో ఆర్డర్ పెడితే మన ఊరి పిల్లలే మన ఇంటి ముందుకు తెచ్చి ఇస్తున్నారు. ఈ కామర్స్‌తో డెలివరీ బాయ్ రూపంలో సరికొత్త ఉపాధి అందుబాటులోకి వచ్చింది. అయితే తనతో పాటు కొన్ని ఇబ్బందులు కూడా మోసుకొచ్చింది. ఇప్పుడు వాటికి పరిష్కార మార్గాలు చూపి గిగ్‌వర్కర్లకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. IIలో

గజవెల్లి షణ్ముకరాజు, సాక్షి సిద్దిపేట

నవంబర్‌లోనే పత్తి కొనుగోళ్లు!

తేమ పేరుతో సీసీఐ కాలయాపన

- ప్రైవేటు వ్యాపారులకు ఉత్పత్తుల విక్రయం
- రైతులకు దక్కని మద్దతు ధర



జగదేవ్‌పూర్ మండలం అలిరాజపేటలోని మిల్లులో పత్తి

తేమ పేరుతో సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోళ్లను ప్రారంభించడంలో కాలయాపన చేస్తోంది. జిల్లాలోని 16 జిన్నింగ్ మిల్లులను సీసీఐ కేంద్రాలుగా నోటిఫై చేసి 10 రోజులు గడుస్తున్నా కార్యకలాపాలు ప్రారంభించకపోవడం రైతులకు శాపంగా మారింది. ఇదే అదనుగా వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు.

గజ్వేల్: సిద్దిపేట జిల్లాలో 1.04 లక్షల ఎకరాలు పత్తి సాగులోకి వచ్చింది. జిల్లావ్యాప్తంగా 9 లక్షల క్వింటాళ్ల దిగుబడులు రావొచ్చని మార్కెటింగ్ శాఖ అంచనా. పింజ పెద్దగా ఉన్న పత్తికి గరిష్ఠంగా రూ.7521, కనిష్ఠంగా ధర రూ.7124 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించింది. తేమ శాతం 8–12కు మించకూడదు. కానీ సీసీఐ కేంద్రాలను తెరవడంలో సంబంధిత అధికారులు తేమ పేరుతో నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల రైతులు తమ ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 5 వేల మెట్రిక్ టన్నుల అంటే 50 వేల క్వింటాళ్లకు పైగా కొనుగోళ్లు జరిగినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యాపారులు ఇదే అదనుగా ధరను ఇష్టానుసారంగా తగ్గించి కొంటున్నారు. ఎక్కడా కూడా క్వింటాలుకు రూ.6000–6400 మించి చెల్లించడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఇది రూ.1000–1500 తక్కువ అన్నమాట. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే రైతులు మరింతగా నష్టపోవడం ఖాయంగా కనిపిస్తున్నది.

కొనుగోళ్లు ప్రారంభించేది అప్పుడేనా?

ప్రస్తుతం తీస్తున్న పత్తిలో 15–20 శాతం తేమ వస్తున్నదనే సాకుతో సీసీఐ అధికారులు కొనుగోళ్లకు ముందుకు రావటం లేదని తెలుస్తోంది. నవంబర్ మొదటి వారం వరకు తేమ తగ్గి సీసీఐ ప్రమాణాలకనుగుణంగా తేమ శాతం 8– 12 శాతం ఉండే అవకాశముందని అప్పుడే కేంద్రాలను తెరవాలని భావిస్తున్నట్లు తెలిసింది. సీసీఐ వాదన ఎలా ఉన్న రైతులు మాత్రం ప్రైవే టు వ్యాపారుల చేతిలో నిలువు దోపిడీకి గురవుతున్నారు. తేమ పేరుతో వారు తూకాల్లో మోసాలకు పాల్పడటం, తరుగు విధిస్తూ అతి తక్కువ ధరను చెల్లించడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో సీసీఐ రంగంలోకి దిగితేనే ధర పెరుగుదల కనిపించనుంది. తూకాల్లో మోసాలకు కూడా చెక్ పడనుంది.

కార్యకలాపాలు జరపాలని సంప్రదింపులు

సీసీఐ కేంద్రాలను తెరవడానికి జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. అధికారులు తేమ కారణంగా కొనుగోళ్లను ప్రారంభించడానికి ఆలస్యం చేస్తున్నారు. వెంటనే కార్యకలాపాలు చేపట్టాలని నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలోనే కేంద్రాలు తెరిచే అవకాశముంది. రైతులు తొందరపడి దళారులకు ఉత్పత్తులను అమ్ముకోవద్దు. – జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు

వారు ఆర్థికంగా ఎదిగేందుకే..

మంత్రి పొన్నం ప్రభాకర్

- శనిగరం ప్రాజెక్ట్‌లో ఉచిత చేప పిల్లల పంపిణీ



రిజర్వాయర్ వద్ద మంత్రి పొన్నం, కలెక్టర్ మనుచౌదరి తదితరులు

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రాజెక్టు నీటిని కాలువల ద్వారా ప్రతీ గ్రామానికి సాగు నీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని శనిగరం రిజర్వాయర్‌లో 100 శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థికంగా ఎదిగేందుకు గతంలో కన్నా ఎక్కువగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లాలో మత్స్య సహకార సంఘాలున్న వాటికే పరిమితం కాకుండా నీటి నిల్వలు ఉన్న దగ్గర కూడా చేప పిల్లలు విడుదల చేయాలని కలెక్టర్ మనుచౌదరికి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల కాలువల పనుల్లో జాప్యం జరిగిందన్నారు. వేగంగా వాటి నిర్మాణ పనులను పూర్తి చేసి నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ శంకర్ రాథోడ్, సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి హరికృష్ణ, మండలాధ్యక్షుడు మంద ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించండి

అధికారులతో కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఇచ్చిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం ప్రగతిని సాధించేలా అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆయిల్ పామ్ సాగు విస్తరణపై వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ మండలస్థాయి అధికారుల శిక్షణ, సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలోని ఆయిల్ పామ్ సాగు కోసం రైతుల గుర్తింపు, మొక్కలు నాటడం, ఎరువుల యాజమాన్యం, వ్యాధి తెగుళ్ల నివారణ, అంతర్ పంట సాగు , పంటకోత పద్ధతులపై దిశానిర్దేశం చేశారు. ఈ సాగు సంబంధించి పూర్తి అవగాహన, ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న సబ్సిడీ, ప్రోత్సాహం గురించి సంపూర్ణ సమాచారాన్ని మొదటగా అధికారులు అవగతం చేసుకోవాలన్నారు. అనంతరం రైతు సాగు సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి దిశగా కృషి చేయాలన్నారు. షెడ్యూల్‌ను రూపొందించుకొని రైతుల వద్దకు వెళ్లడం, సాగుకు వారిని ప్రోత్సహించడం, రైతువేదికలలో అవగాహన సదస్సులను నిర్వహించడం వంటి కార్యక్రమాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త సుబ్బారావు, వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పట్ల శ్రద్ధ అవసరం

డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారిపైన ప్రత్యేక శ్రద్ధం వహించాలని, సలహాలు, సూచనలతో పాటు ఫాలోఅప్ చేస్తుండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు, బస్తీ దవాఖానాల ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులతో కలిసి ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడాలన్నారు. సెంటర్ పరిధిలో ఏమైనా సమస్యలు తలెత్తితే సిబ్బంది వెంటనే స్పందించి గ్రామానికి వెళ్లి కారణాలు తెలుసుకుని జిల్లా కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శ్రీకళ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పలకుప్పగా మార్చిన బీఆర్ఎస్

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



తుక్కాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రాష్ట్రాన్ని బీఆర్ఎస్ నాయకులు లూటీ చేశారని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని లింగాపూర్, వెంకట్రావుపేట, తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాలతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు తిరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గాడిలో పెడుతూ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఎకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ప్రవీన్, కొండల్‌రెడ్డి, చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

భూంపల్లి, మిరుదొడ్డిల్లో సన్నరకం కేంద్రాలు

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని డీపీఎం రాజయ్య, ఏపీఎం దాకయ్య అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు సీసీలకు శనివారం ప్రత్యేక శిక్షణ కల్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూంపల్లి, మిరుదొడ్డి గ్రామాల్లో సన్న రకం కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. సన్నరకం ధాన్యంకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దళారులను ఆశ్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో సీసీ బాలరాజు, ప్రభాకర్, దాస్, వైకుంఠం, సిద్ధయ్య, మన్నెమ్మ, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

టపాసుల వ్యాపారాలపై విచారణ చేయాల్సిందే

సిద్దిపేటరూరల్: దీపావళి పండుగను పురస్కరించుని సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న టపాసుల వ్యాపారాలపై సమగ్ర విచారణ జరపాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సెంట్రల్ ఫర్ లీగల్ సర్వీసెస్ కోరింది. శనివారం కలెక్టరేట్ కార్యాలయ ప్రతినిధికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీసీఆర్ సంస్థ జిల్లా అధ్యక్షుడు శివ చంద్రం, సెంట్రల్ కమిటీ కార్యదర్శి సాజిద్ మాట్లాడుతూ పండుగను పురస్కరించుకొని ఏర్పాటు కానున్న టపాసుల విక్రయ కేంద్రాల వారు నిబంధనలను ఖాతరు చేయరనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. ఏడు శాఖల అనుమతులు అవసరమైనప్పటికి వాటిని పట్టించుకోకుండా, వ్యాపారులు జీరో బిజినెస్‌కు తెరలేపుతారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. టపాసులు కొనే వినియోగదారులకు కనీసం ఒరిజినల్ బిల్లు కూడా ఇవ్వడం లేదన్నారు. శివ కాశి నుంచి కిలోల చొప్పున తెచ్చి ఈ ప్రాంతంలో అధిక ధరలతో అందినకాడికి దోచుకుంటున్నారన్నారు.

జాతీయ స్వేరోస్ మహాసభకు తరలిరండి

మర్కూక్(గజ్వేల్): ఏడవ జాతీయ స్వేరోస్ మహాసభను విజయవంతం చేయాలని స్వేరోస్ జాతీయ మహాసభ కార్యక్రమ కన్వీనర్ చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రవల్లిలో శనివారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో నిర్వహించే ఏడవ జాతీయ స్వేరోస్ మహాసభ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పోస్టరావిష్కరణలో సభ్యులు తుమ్మకృష్ణ, భిక్షపతి, బాలరాజు, నవీన్, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, బీబీపేట రాజు, నటరాజు, విక్రమ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకే పరేడ్



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ సుభాశ్‌చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): పరేడ్ వల్ల పోలీస్ సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాశ్ చంద్రబోస్ అన్నారు. శనివారం మండలపరిధిలోని పెద్దకోడూరు శివారులో ఉన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం దొరికినప్పుడు సిబ్బంది వ్యాయామం చేయాలన్నారు. మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు అలవాట్లకు పడి విధులలో నిర్లక్ష్యం వహిస్తే పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే వారవుతారన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేటకమాన్ : సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐలు, విద్యార్థులు



గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణం.. ర్యాలీలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పోలీసులు

అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

సిద్దిపేటకమాన్: పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఏసీపీ మధు అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తొలుత జెండా ఊపి ర్యాలీని ఆయన ప్రారంభించారు. పట్టణంలోని పాఠశాల విద్యార్థులతో కలిసి సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు నరసింహారావు, వెంకట్‌రెడ్డి సైకిల్ ర్యాలీ చేపట్టారు.

ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. సిద్దిపేట డివిజన్ నాలుగు పీఏస్‌ల పరిధిలోని రాజీవ్ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను సీఐలు ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, ఆర్ అండ్ బీ, వివిధ శాఖల అధికారులతోల కలిసి ఆయన శనివారం పరిశీలించారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: పోలీస్ అమరులు చేసిన త్యాగాలను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలని ఏసీపీ సతీశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో చేపట్టిన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు.

గజ్వేల్ రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యలను పరిష్కరించి ప్రజలకు అండగా నిలవడమే పోలీసుల కర్తవ్యమని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద సైకిల్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు.

క్లుప్తంగా

రైస్ మిల్లుకు నోటీసులు

డీఎస్ఓ తనూజ

దుబ్బాక: సీఎంఆర్ బియ్యంను సకాలంలో అందించని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డులో గల మహేశ్వర రైస్ మిల్లుకు శనివారం నోటీసులు అందించినట్లు డీఎస్ఓ తనూజ తెలిపారు. 2023 వానాకాలం పంటకు సంబంధించి మహేశ్వర రైస్‌మిల్లు నుంచి ప్రభుత్వానికి మొత్తం 55.91 ఏసీకేల బియ్యం రావాల్సి ఉండగా 38.26 ఏసీకేలు మాత్రమే వచ్చాయన్నారు. మిగితా 17.65 ఏసీకేల బియ్యం (దాదాపు 5 వేల క్వింటాళ్లు) బకాయి పడ్డారన్నారు.ఈ మిల్లుకు సంబంధించి ఇద్దరు భాగస్వాములు మృతి చెందగా మిగితా భాగస్వాముల మధ్య చోటు చేసుకున్న సమస్యల కారణంగా బకాయి పడ్డ బియ్యాన్ని ప్రభుత్వానికి స్వాధీనపర్చలేదన్నారు. 10 మంది భాగస్వాములకు నోటీసులు అందించామని 30లోగా బియ్యం అందించకపోతే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. గత వానాకాలానికి సంబంధించి జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్‌కు తరలించగా దాదాపుగా 99 శాతం బియ్యం రికవరీ అయ్యిందన్నారు.

రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు విద్యార్థి ఎంపిక



అనిల్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి అనిల్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ రవి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్, పీఈటీ లింగం శనివారం తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే 43వ జూనియర్ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి అనిల్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినందించారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆరుగురు అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో గుట్టల్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్ఐ విజయ రావు సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పట్టుబడగా రూ.66,850 నగదు, మూడు కార్లు, రెండు స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో 8 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్క్ చేసిన ఆటో చోరీ



చోరీకి గురైన ఆటో

హత్నూర(సంగారెడ్డి): ఆటో చోరీకి గురైన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. దౌల్తాబాద్‌లో నివాసం ఉండే షబ్బీర్ అలీ కాసాల గ్రామ శివారులోని సుగుణ పౌల్ట్రీ పరిశ్రమలో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు కాసాల గ్రామానికి చెందిన సాయిబాబాకు చెందిన ఆటోను అద్దెకు తీసుకుని నడిపించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఎప్పటిలాగే దౌల్తాబాద్‌లోని చౌదరి హోటల్ పక్కన శుక్రవారం రాత్రి ఆటోను పార్కింగ్ చేసి అద్దె ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం చూసేసరికి ఆటో లేకపోవడంతో ఆందోళన గురై చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

స్మార్ట్ బాయ్స్



● కాలంతో పరుగెడుతున్న 'డెలివరీ బాయ్స్'

● ఆర్డర్ పెట్టిన నిమిషాల్లో ఇంటి ముందుకు



సాక్షి, సిద్దిపేట: డెలివరీ బాయ్స్ అంటే కాలంతో పాటు పరుగెత్తుతారు.. రోజుకు 18 గంటలు సేవలందిస్తారు.. కానీ, ఉద్యోగులు కాదు.. కనీస వేతనాలు లెక్కల్లోకే రావు.. బీమాలు, ఉద్యోగ భద్రత లాంటివి ఉండవు.. రోడ్డు ప్రమాదంలోనో, అనారోగ్య కారణాలతోనో చనిపోతే వారి కుటుంబాలు రోడ్డుపాలవుతాయి. ప్రభుత్వాలు, పని చేయించుకుంటున్న సంస్థలు ఆదుకోవు. ఇదీ.. ఫుడ్ ఆర్డర్ చేయగానే నిమిషాల్లో డెలివరీ చేసే గిగ్ వర్కర్స్ దుస్థితి. వీరే కాదు.. ఈ కామర్స్ సంస్థలకు సంబంధించిన హోం డెలివరీలు చేసేవారు, బైక్‌లపై ప్యాసింజర్లను తీసుకెళ్లేవారి పరిస్థితి ఇంతే..

ఎవరీ గిగ్ వర్కర్‌లు

ఈ కామర్స్ వంటి సంస్థల్లో తాత్కాలిక ఉపాధి అవకాశాలు పొందేవారిని 'గిగ్' వర్కర్స్ అంటారు. 20వ శతాబ్దంలో జాజ్ యాస నుంచి గిగ్ అనే పదం పుట్టింది. పేరుకు గిగ్ సేవా రంగం పరిధిలో ఉన్నప్పటికీ.. వీళ్లు ఉద్యోగులా? వ్యాపారులా? భాగస్వాములా? కార్మికులా ఇలా వీళ్లకు గుర్తింపు లేదు. ఆ కంపెనీలలో డెలివరీ పార్ట్ నర్స్‌గా మాత్రమే పరిగణిస్తున్నారు.

రాజస్థాన్‌లో ఇలా..

కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న సోషల్ సెక్యూరిటీ కోడ్‌ను రాజస్థాన్ రాష్ట్రం మాత్రమే అమలు చేస్తోంది. అక్కడ 3 లక్షల మంది గిగ్ వర్కర్స్ ఉండగా.. 'రాజస్థాన్ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ఫండ్'ను ప్రకటించి, రూ.200 కోట్ల నిధులను కేటాయించింది. ప్రతీ ఫుడ్, ఈ కామర్స్ డెలివరీ, బైక్ రైడ్‌కు రూ.2 విధిస్తున్న ప్రభుత్వం, ఆ నిధులను వెల్ఫేర్ ఫండ్‌లో జమ చేస్తోంది. ఆ ఫండ్ ఆధారంగా గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది. అదే విధంగా మన రాష్ట్రంలో సైతం అమలు చేసి డెలివరీ బాయ్స్‌కు అండగా నిలువాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులు

అడ్రస్ లభించక.. బైక్ రిపేర్‌కు వచ్చి.. పెట్రోల్ అయిపోయి.. ట్రాఫిక్ ఇబ్బందులు, సరైన రోడ్డు లేక ఆలస్యమైతే వినియోగదారుల నుంచి తిట్లు, నెగిటీవ్ ఫీడ్ బ్యాక్‌లు తప్పవు. ఇంత లేటా? అడ్రస్ ఒక్కసారి చెబితే అర్థం చేసుకోలేవా.. అంటూ అప్పుడప్పుడూ అసహనం వ్యక్తం చేస్తుంటారు. ఒక్కోసారి ఆర్డర్ బుక్ చేసి తర్వాత వినియోగదారులు ఫోన్‌లు లిఫ్ట్ చేయకపోవడం సైతం వీరికే ఇబ్బంది. కొన్నిసార్లు కస్టమర్ తీసుకోకున్నా ఫుడ్‌కు సంబంధించిన డబ్బులు డెలివరీ బాయ్‌ల మీదనే పడుతుంది.

డ్రైవింగ్ లైసెన్స్ అర్హతగా..

డ్రైవింగ్ లైసెన్స్, సొంత వాహనం ఉంటే చాలు.. ఈ సంస్థలు ఉపాధి కల్పిస్తున్నాయి. ఉద్యోగాల కోసం ప్రయత్నించి, విసిగిపోయిన చాలా మంది ఫుడ్ డెలివరీ, బైక్ రైడర్స్‌గా పనిని ఎంచుకుంటున్నారు. ఒక్కో ఆర్డర్‌కు చొప్పున డబ్బులను, రోజుకు 8 గంటలు లోకేషన్ ఆన్ చేసుకొని ఉంటే కొంత బోనస్ సైతం అందిస్తున్నారు. కొందరు ఒకరి కింద పని చేయడం ఎందుకని ఫుడ్ డెలివరీ, బైక్ రైడర్స్‌గా పని చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2 వేలకుపైగా మంది వరకు డెలివరీ బాయ్స్, బైక్ రైడర్స్ ఉన్నారు. వారు ఇచ్చే ఆర్డర్‌లను బట్టి ఒక్కొక్కరు సుమారుగా రోజుకు రూ.500లకు పైగా సంపాదిస్తున్నారు.



ర్యాపిడో ద్వారా ప్యాసింజర్‌ను తీసుకెళ్తున్న బైక్ రైడర్

ఏ పని లభించక...



డిగ్రీ మధ్యలోనే ఆపేశాను. ఏ పని లభించక జోమాటోలో డెలివరీ బాయ్‌గా, అదే విధంగా రాపిడో బైక్ రైడర్‌గా చేస్తున్నా.. రెండు యాప్‌లు ఆన్ చేసి పెట్టుకుంటాను.. ఏది వస్తే దానికి వెళ్తాను. జొమాటో ఆర్డర్ డెలివరీ చేసిన తర్వాత మళ్లీ ఖాళీగా రాకుండా ర్యాపిడో బైక్ రైడ్ ఏమైనా లభిస్తుందో చూస్తాం. బైక్ రైడ్ వస్తే ప్యాసింజర్‌ను ఎక్కడ డ్రాపింగ్ చేయాలో అక్కడ చేస్తాం. దీంతో కొంత పెట్రోల్ సేవ్ అవుతుంది.

– ప్రవీణ్, సిద్దిపేట, బైక్ రైడర్

రోజుకు రూ.600



రెండేళ్ల నుంచి ఈ కామర్స్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నా. ఒక్కో పార్సల్‌కు రూ.12 చొప్పున సంస్థ అందజేస్తుంది. నాకున్న పరిధిలో ఎంత దూరమైన దానిని డెలివరీ చేసి రావాలి. ఒక్కోసారి తీరా వాళ్ల ఇంటి దగ్గరకు వెళ్లిన తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయరు. చూసి చూసి వెనక్కి వచ్చేస్తాం. మళ్లీ కాసేపటికి ఫోన్ చేస్తే తిరిగి వెళ్లి ఆర్డర్‌ను డెలివరీ చేస్తాం.. ఇలా రోజుకు రూ.600 వరకు సంపాదిస్తున్నా.. రూ.150 వరకు పెట్రోల్‌కు ఖర్చు కాగా రూ.450 మిగులుతాయి.

– రవీందర్ రెడ్డి, ఈ కామర్స్ డెలివరీ బాయ్

ప్రభుత్వం ఆదుకోవాలి



కస్టమర్ ఇంటి అడ్రస్ లభించక. ట్రాఫిక్ జామ్‌తో డెలివరీ లేట్ అయితే మా చార్జెస్ సైతం వేస్తారు. రోజంతా కష్టపడి చేసిన డబ్బులు చార్జెస్ రూపంలో పోయిన ఘటనలున్నాయి. రాత్రి సమయంలో ఆర్డర్ చేసిన వారు ఫోన్‌లు లిఫ్ట్ చేయకపోతే 40 నిమిషాల పాటు అక్కడే వెయిట్ చేసి ఆర్డర్ రద్దు చేసుకొని వచ్చి మళ్లీ రెస్టారెంట్‌లో ఫుడ్‌ను అప్పగించాలి. 15 రోజుల కిందట ఫుడ్ డెలివరీ ఇచ్చేందుకు వెళ్తుంటే బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద యాక్సిడెంట్ అయింది. దీంతో నా బైక్ హెడ్ లైట్ పగిలిపోయింది. మళ్లీ నా డబ్బులు పెట్టి రిపేర్ చేయించుకున్నాను. ప్రభుత్వం డెలివరీ బాయ్‌లను ఆదుకోవాలి.

– జగదీశ్, డెలివరీ బాయ్



సిద్దిపేటలో ఈ-కామర్స్ సంస్థకు చెందిన డెలివరీలు ఇచ్చేందుకు బయలుదేరుతున్న డెలివరీ బాయ్స్



ఫుడ్ డెలివరీ చేస్తున్న బాయ్

డెలివరీ బాయ్స్‌ను కలుసుకొని కష్టాలు తెలుసుకొని

కోహ్లి సెంటర్ ఫర్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్‌లో ప్రొఫెసర్ నిమ్మి రంగస్వామి, పరిశోధక విద్యార్థి తన్మయి గోయల్‌లు హైదరాబాద్, చెన్నై, ముంబయిల్లో వేల మంది ఫుడ్ డెలివరీ బాయ్‌లను కలుసుకొని కష్టాలు అడిగి తెలుసుకున్నారు. వారు గిగ్ వర్కర్ల జాబితాలో ఉన్నా, కార్మిక చట్టాలు డెలివరీ బాయ్స్‌కు వర్తించడం లేదని గుర్తించారు. ఈ అధ్యయనం కొద్దిరోజుల కిందట అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితం కాగా, బార్సిలోనాలో ఇటీవల జరిగిన యూరోపియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ ఆంత్రోపాలజిస్ట్ సదస్సులో ప్రత్యేకంగా దీనిపై ప్రస్తావించారు.

అక్రమ నీటి తరలింపును అడ్డుకోండి

ఆర్డీఓకు హల్దీవాగు పరివాహక ప్రాంత రైతులు ఫిర్యాదు



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

తూప్రాన్: పట్టణ సమీపంలోని కిష్టాపూర్ హల్దీవాగు గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి అక్రమంగా మోటార్లతో నీటి తరలింపును అడ్డుకోవాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డికి శనివారం రైతులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలోని యావపూర్ గ్రామ శివారులో సుమారు 90 ఎకరాల భూమిని మల్లారెడ్డి అనే వ్యక్తి గతంలో ఖరీదు చేశారన్నారు. హల్దీవాగు నుంచి మోటార్ల ద్వారా అక్రమంగా నీటిని తరలిస్తున్నారని తెలిపారు. ఈ భూమి మాజీ సీఎం కేసీఆర్ బంధువు కన్నారావు అనే వ్యక్తికి చెందిందని మల్లారెడ్డి తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. అక్రమంగా నీటిని తరలించడం ద్వారా ఈ ప్రాంత రైతులకు అన్యాయం జరుగుతుందని, వెంటనే అడ్డుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ఐదుగురి ఆర్ఎంపీ ఆస్పత్రులు సీజ్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆర్ఎంపీల ఆస్పత్రులను డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి మధుకర్ సీజ్ చేశారు. శనివారం మండలంలోని అన్నారం, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఐదుగురి ఆర్ఎంపీల ఆస్పత్రులను గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ.. ఆర్ఎంపీ ఆస్పత్రుల్లో కేవలం ప్రథమ చికిత్స అందించాలని, అలా కాకుండా ప్రసవాలు, ఆపరేషన్లు వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది ఆర్ఎంపీలు యథేచ్ఛగా వైద్య చికిత్సలు చేయడం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో డీఎంహెచ్ఓ సూచన మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



మనోజ్ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని శభాష్‌గూడెంలో చోటు చేసుకుంది. కొమురవెల్లి ఎస్ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గాడిపల్లి నర్సింహులు కుమారుడు గాడిపల్లి మనోజ్ (14) పట్టణ కేంద్రంలోని వికాస్ గ్రామర్ స్కూల్‌లో 8 వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చిన విద్యార్థి బావి వద్దకు వెళ్లి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి తన కుమారుడు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇది ఇలా ఉంటే స్థానికులు మాత్రం పాఠశాలలో పరీక్ష రాసే సమయంలో కాపీ కొడుతుండగా మనోజ్ దొరికిపోయాడని, ఈ విషయాన్ని ఉపాధ్యాయులు తండ్రి నర్సింహులుకి చెప్పగా పాఠశాలకు వచ్చిన తండ్రి విద్యార్థుల ముందు దండించడంతో మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చర్చించుకుంటున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడు



సాయి(ఫైల్)

మర్కూక్(గజ్వేల్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన మర్కూక్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదర్ కథనం మేరకు.. మర్కూక్ గ్రామానికి చెందిన నీల సాయి (23)కి రెండేళ్ల కిందట భవానీతో వివాహమైంది. సాయి తరచూ మద్యం సేవించి భార్యతో గొడవపడుతుండటంతో భవానీ తల్లి దండ్రులు వచ్చి పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకున్నాడు. శనివారం చుట్టుపక్కల వారికి సాయి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో తలుపులు తెరిచి చూసేసరికి ఉరేసుకొని కనిపించాడు. రెండు రోజుల కిందటే ఉరేసుకొని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



శివమల్లు మృతదేహం

నిజాంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిప్పన్నగుల్ల గ్రామానికి చెందిన బొమ్మ శివమల్లు(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం చేపల వేటకు హైదర్ చెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. భార్య ఐలవ్వ బంధువులతో కలిసి చెరువులో వెతుకుతుండగా శనివారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.20.60 లక్షలు బురిడీ

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ కొట్టించి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 23వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. ట్రేడింగ్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. బాధితుడు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడుతూ వచ్చాడు. పలు దఫాలుగా మొత్తం రూ.20 లక్షల 60 వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతోపాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లుగా గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): పట్టపగలే ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మిర్జాపల్లి గ్రామానికి చెందిన చెరుకు శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం భోజనం చేసి మూడు గంటల సమయంలో ఇంటికి తాళం వేసి ధాన్యం కల్లం వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి గొళ్లెం పగులగొట్టి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో బంగారం కనిపించలేదు. 4.5 తులాల బంగారు ఆభరణాలు నెక్లెస్, కమ్మలు బుట్టాలు, వంకు ఉంగరం, ముక్కుపుడుక, 35 తులాల వెండి కడియాలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



తాళం పగులగొట్టిన దొంగలు

పత్తిలో గంజాయి మొక్కలు సాగు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన మన్నె విఠల్ పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్‌తో పాటు సిబ్బంది దాడులు నిర్వహించారు. 16 కిలోల ఎండు గంజాయితోపాటు అంతర పంటగా సాగవుతున్న 17 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి విలువ సుమారుగా రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు.



నిందితుడు, గంజాయి మొక్కలతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

భక్తులు జారిపడితే నాకేంటి..

ఏడుపాయల్లో ఈఓ నిర్లక్ష్య వైఖరి



పడిపోయిన భక్తులను లేపుతున్న తోటి భక్తులు

పాపన్నపేట(మెదక్): మంజీరా వరదల కారణంగా ఏడుపాయల్లో దేవాదాయ శాఖ కార్యాలయం ముందు భక్తులు జారి పడుతున్నా ఈఓ చంద్రశేఖర్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఏడుపాయల్లో కొన్ని ప్రాంతాల్లో వరదలు పోటెత్తాయి. దీంతో మంజీరా తీర ప్రాంతాలు పాకూరుపట్టగా, నీటిలో కాళ్లు కడుక్కుందామని వెళ్లిన భక్తులు ఎంతో మంది జారిపడి గాయాలపాలయ్యారు. పది గజాల దూరంలో ఉండి కూడా ఈఓ కనీస చర్యలు చేపట్టలేదు. పాకూరు తొలగించే ప్రయత్నం చేయకపోగా, బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులు అక్కడకు వెళ్లకుండా జాగ్రత్తలు కూడా తీసుకోలేదని బాధితులు వాపోయారు.

లారీ, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): లారీ, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు ఈ ఘటన పెద్దశంకరంపేట శివారులో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం శెల్గిరా గ్రామానికి చెందిన కూనింటి ప్రభాకర్ బైక్‌పై పెద్దశంకరంపేట వైపు నుంచి అల్లాదుర్గం వైపు వెళ్తుండగా మలుపు స్పీడ్ బ్రేకర్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రభాకర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

పశువులకు గాలికుంటు టీకాలు

● జిల్లాలో కొనసాగుతున్న శిబిరాలు
● ప్రతి ఆరు నెలలకు ఒకసారి వ్యాక్సినేషన్
● ఆన్‌లైన్ లో వివరాల నమోదు
● సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

సంగారెడ్డి జోన్: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు చర్యలో భాగంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువులకు వ్యాధి నివారణ చర్యలో భాగంగా జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలి కుంటు టీకాలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో బృందాలుగా ఏర్పడి ఈనెల 14 నుంచి టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది, పశుపోషకులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,25,277 పశువులు ఉన్నాయి. అందులో 1,56,282 ఆవులు, 1,68,995 గేదెలు ఉన్నాయి. వీటిలో వ్యాక్సినేషన్ వేసేందుకు 1,69,455 పశువులను గుర్తించారు.
- జిల్లాలో 72 బృందాలుగా ఏర్పడి, ప్రతిరోజు గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తున్నారు. జిల్లాకు 1,59,750 వ్యాక్సినేషన్‌లు వచ్చాయి.
- ఈనెల 15న ప్రారంభమై నవంబర్ 14వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 46,856 పశువులకు గాలికుంటు టీకాలు వ్యాక్సినేషన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.
- టీకాలు వేసిన పశువులకు 12 అంకెలతో పాటు బార్ కోడ్ కలిగిన ట్యాగ్‌లను వేస్తున్నారు. ఇంతకుముందే ట్యాగులు ఉంటే ఎగ్జిస్టింగ్ ట్యాగ్‌గా గుర్తిస్తున్నారు.
- అదేవిధంగా పశువులకు వ్యాక్సినేషన్ అనంతరం పశువురకంతో పాటు యజమాని తదితర వివరాలను భారత్ పశుధన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, తదితరులు(ఫైల్)

జిల్లాలో ఉన్న పశువులు	
ఆవులు	1,56,282
గేదెలు	1,68,995
మొత్తం	3,25,277
జిల్లాలోని వ్యాక్సినేషన్ వేయాల్సిన పశువులు	1,69,455
జిల్లాలోని వ్యాక్సినేషన్ పూర్తి అయిన పశువులు	46,856

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా గ్రామాలలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. పశు పోషకులు తమ వద్ద ఉన్న పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలో భాగంగా వ్యాక్సినేషన్ వేస్తున్నాం.

–డాక్టర్ ఎం.వసంత కుమారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి